లతో మాట్లాడి... తాండూరు పప్పు నాణ్యతను, అది పెరిగే ప్రత్యేక పరిస్థితులను పరిశీలించి తృప్తి చెందిన తర్వాతే జీఐ అవకాశాన్ని ప్రకటించారు. ఈ ప్రకటనతో ప్రక్రియ ముగిసినట్టు కాదు. ప్రకటన వెలువడిన ఓ నాలుగు నెలల వ్యవధిలో ఎవరన్నా తమ అభ్యంతరాలు చెబుతూ, ప్రక్రియకు అడ్డుపడవచ్చు. ఈ అంచెలన్నీ దాటుకుని తాండూరు పప్పు GI హోదా అందుకుంది.

**విలువ పెరుగుతుంది**

ఒక వస్తువు లేదా ఉత్పత్తికి భౌగోళిక గుర్తింపు వచ్చినప్పుడు... దాని గురించి ప్రపంచ వ్యాప్తంగా చర్చ జరుగుతుంది. ప్రత్యేకత సంతరించుకుంటుంది. ఆ ఉత్పత్తి మీద జీఐ గుర్తింపు ముద్రించినప్పుడు, దాన్ని స్కాన్ చేసే వినియోగదారులకు ఆ ప్రత్యేకత తెలుస్తుంది. తాండూరు పప్పు విషయంలో కూడా అదే జరిగింది. ఈ దినుసుకు జీఐ గుర్తింపు వచ్చిన కొద్దిరోజులకే, కొందరు రైతులు 30 శాతం అధిక మార్కెట్ రేట్లకు అమ్ముకున్న సందర్భాలు ఉన్నాయి. కాకపోతే దాని గురించి అవగాహన ఉండాలి. ఈ కందిపప్పును 25 ఎకరాలు, 40 ఎకరాల్లో పండిస్తున్నవారికే జీఐ గుర్తింపును లాభసాటిగా ఎలా వినియోగించుకోవాలో తెలియని సందర్భాలు ఉన్నాయి. ఇక చిన్నకారు రైతుల గురించి చెప్పేదేముంది. అందుకే చాలా కొద్దిమంది మాత్రమే... తమ పేరును జీఐ హక్కు కోసం రిజిస్టర్ చేసుకున్నారు. ఈ సంఖ్య పెరగాలి.

**కీర్తికి భద్రత!**

ప్రపంచ వాణిజ్య సంస్థలోని భాగస్వామ్య దేశాల మధ్య జరిగిన TRIPS అనే ఒప్పందంలో భాగంగా ఒక ప్రత్యేక ప్రాంతంలో ఉత్పత్తి అయ్యే వస్తువులకు భౌగోళిక గుర్తింపు ఇవ్వాలనే సూచన జరిగింది. ఇందులో భాగంగా సభ్యదేశాలన్నీ GI హక్కును కాపాడేందుకు తగిన చట్టాలు కూడా రూపొందించాలి. ఈ నిబంధనను అనుసరించి మనదేశంలో కూడా 2003 నుంచి Geographical Indications చట్టం అమలులోకి వచ్చింది. ఢిల్లీలో ఉన్న కాపీరైట్ కార్యాలయం లేదా ముంబయిలోని ఇండస్ట్రియల్ ప్రాపర్టీ కార్యాలయాల్లో భౌగోళిక గుర్తింపు కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. కచ్చితమైన ఆధారాలు లేని దరఖాస్తులు, ఇతరుల భావోద్వేగాలను రెచ్చగొట్టేలా ఉండే వస్తువులు, అశ్లీలంగా తోచే ఉత్పత్తులు, అన్ని చోట్లా వినిపించే పేర్లతో ఉన్న పదార్థాలను నిర్ద్వంద్వంగా తిరస్కరిస్తారు.

ఒకసారి భౌగోళిక గుర్తింపు దక్కాక, దాన్ని ప్రతి పదేండ్లకు ఓసారి పునరుద్ధించుకోవాల్సి ఉంటుంది. జీఐ గుర్తింపు పొందిన ఉత్పత్తిదారులు, ఆ పేరుతో మరొకరు వ్యాపారం చేయకుండా అడ్డుకోవచ్చు. ఎవరన్నా అలా చేస్తే నష్టపరిహారం కోసం దావా వేయవచ్చు. అంతేకాదు ఎవరన్నా అనుమతి లేకుండానే ఒక భౌగోళిక గుర్తింపు ఉన్న ఉత్పత్తిని అదే పేరుతో రూపొందించడానికో, దాని నకిలీని తయారుచేయడానికో ప్రయత్నిస్తే కారాగార శిక్షతోపాటుగా జరిమానాకు కూడా సిద్ధపడాల్సి ఉంటుంది. కేవలం మనదేశంలోనే కాదు, ప్రపంచ వాణిజ్య సంస్థలో భాగస్వాములుగా ఉన్న దేశాలు, తమ దగ్గర భౌగోళిక గుర్తింపు పొందిన ఉత్పత్తులను సంరక్షించేందుకు ఇలాంటి చట్టాలెన్నో చేశాయి.

మనకు ఇన్నేసి భౌగోళిక గుర్తింపులు లభించిన వాస్తవం సంతోషం కలిగించేదే అయినా... ఇప్పటికీ ఈ GI ప్రత్యేకత గురించి చాలామందికి తెలియకపోవడం, స్పందించాల్సిన విషయం. చాలామంది ట్రేడ్ మార్కులు, పేటెంట్ హక్కులాంటి ఒకానొక ప్రత్యేకతగానే దీన్ని భావిస్తారు. నిజానికి ఒక ఉత్పత్తికి GI గుర్తింపు వచ్చాక, ప్రపంచవ్యాప్తంగా దానికి గిరాకీ ఏర్పడుతుంది. దేశంలో ఉన్న GI ఉత్పత్తులను ప్రోత్సహించేందుకు భారత ప్రభుత్వం చొరవ తీసుకుంటుంది. వ్యవసాయ, చేనేత, హస్తకళ... ఇలా వేర్వేరు శాఖలు భౌగోళిక గుర్తింపు ఉన్న ఉత్పత్తిదారులకు పెద్దపీట వేస్తాయి. అంతర్జాతీయ వాణిజ్య ప్రదర్శనలకు అవకాశం, ఎగుమతులలో రాయితీలు లాంటివి గమనించుకుంటూ ఉండాలి. ఉదాహరణకు భారత రాయబార శాఖ బెల్జియంలో, GI గుర్తింపు ఉన్న మామిడిపండ్లతో ఒక ప్రదర్శన ఏర్పాటుచేసింది. ఇక లాభాలకు అతీతంగా Geographical Indication అనే గుర్తింపు రావడమే ఒక విశేషం. శతాబ్దాలుగా ఓ ప్రాంత ప్రజలు తాము అంటిపెట్టుకుని ఉన్న జీవనవిధానానికి సత్కారం. అక్కడి సంస్కృతిని, ప్రజల నిబద్ధతను, ఉత్పత్తి నాణ్యతను గౌరవించుకోవడం. అందుకే మన చుట్టూ ఉన్న మరిన్ని స్థానిక ఉత్పత్తులకు భౌగోళిక గుర్తింపు తెచ్చుకునే ప్రయత్నం చేయాలి. వాడవాడలా వైవిధ్యమున్న తెలంగాణ, GI సంఖ్యలోనూ దేశంలోనే అగ్రగామి కావాలి. ఇది అత్యాశ కాదు. అవగాహనతో సాధ్యమే! ■

## హైదరాబాద్‌కు రెండు



**ప్రతిష్ఠాత్మక** భౌగోళిక గుర్తింపు పొందిన ఉత్పత్తుల జాబితాలో మన హైదరాబాద్ ఠీవిగా ఉంది. రెండు GI గుర్తింపులను అందుకుంది. మరెన్నిటికో సిద్ధంగా ఉంది. ఒక పదిహేనేండ్ల క్రితమే హైదరాబాదీ హలీంకు ప్రత్యేక గుర్తింపు వచ్చింది. హలీం ఇక్కడ ఆవిర్భవించిన వంటకం కాకపోయినా స్థానిక దినుసులు, రుచులను జోడించి దాన్ని తీర్చిదిద్దిన విధానం ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకుంది. రంజాన్ మాసంలో ఉపవాసం ఉండేవారికి ఇది మరునటి రోజంతా సత్తువగా గడిపే శక్తిని అందిస్తుంది. మాంసం, గోధుమ, మసాలా దినుసులతో... బట్టీల మీద గంటల తరబడి శ్రద్ధగా ఉడికించే ఈ హలీం రుచి కోసం ఇతర ప్రాంతాల నుంచి కూడా హైదరాబాదుకు వస్తారంటే ఆశ్చర్యపడాల్సిన అవసరం లేదు. ఇక కుతుబ్‌షాహీల కాలంనాటి లక్కగాజులకు ఈ ఏడాదే భౌగోళిక గుర్తింపు లభించింది. నిజాం కాలం నాటి లాడ్‌బజార్‌కే ప్రత్యేకమైన ఈ లక్కగాజులకు అధికారిక GI ట్యాగ్ కోసం ఏకంగా రెండేండ్లు వేచి చూడాల్సి వచ్చింది. 500 సంవత్సరాల చరిత్ర ఉన్న ఈ లక్కగాజుల తయారీ ఎటునుంచి వచ్చిందో కచ్చితంగా చెప్పలేకపోయినా... దేశవిదేశ యాత్రికులు హైదరాబాద్ వచ్చినప్పుడు తిరిగి తీసుకువెళ్లే గుర్తుగా మాత్రం ఉండేవి. ఒకప్పుడు వజ్రాలు తాపిన లక్కగాజులకు ఇప్పుడు రంగురాళ్లు అంటించినా, వాటి కాంతులు తగ్గలేదు.







